క్లుప్తంగా

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం


కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మండంలోని నాగారం గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి ప్రతిష్ఠ కార్యక్రమంలో బుధవారం రాత్రి ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు గ్రామ శివారులో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు గురువారం కాంగ్రెస్ కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రం నిర్వాహకులకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మార్క రాజు, తిరుపతిరెడ్డి, కేశవులు, సారయ్య నాయక్, రాజేశం పాల్గొన్నారు.

గర్రెపల్లిలో వాలీబాల్ సమ్మర్ క్యాంపు ప్రారంభం


క్యాంపులో పాల్గొన్న క్రీడాకారులు

సుల్తానాబాద్‌రూరల్: ఉమ్మడి వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గర్రెపల్లిలో ఉచిత వాలీబాల్ సమ్మర్ క్యాంపును గురువారం ప్రారంభించారు. ఉచిత భోజనం, వసతి కల్పించడంతో పాటు నెల రోజులు ఈ సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రావు, జాతీయ వాలీబాల్ క్రీడాకారులు కన్న రమేశ్ తెలిపారు.

కులగణనతో సామాజిక ఐక్యత

పెద్దపల్లిరూరల్: జనగణనతో పాటే కులగణన చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని దేశప్రజలంతా స్వాగతిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలారపు పర్వతాలు, నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జెండాకూడలి వద్ద గురువారం పీఎం చిత్రపటానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు రాకేశ్, మండల అధ్యక్షుడు రమేశ్ తదితరులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. నాయకులు సంపత్‌రావు, శ్రీనివాస్, రాజగోపాల్, రాజం మహంత, శంకర్, తిరుపతి, కిరణ్, పూరెళ్ల రాజేశం, శ్రీకాంత్, సతీశ్, సంపత్, అంజి, రాజు ఉన్నారు.

క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న రఘువీర్‌సింగ్

జూలపల్లి: గ్రామీణ యువత క్రీడల్లో ఉన్నత లక్ష్యం సాధించేందుకు వేసవి క్రీడా శిక్షణ శిబిరం మంచి అవకాశమని జిల్లా గ్రంథాలయ సంస్థ మజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ సూచించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వాలీబాల్ సీనియర్ క్రీడాకారులు కమలాకర్‌రెడ్డి, గంగాధర్, ఖాజామియా, సతీశ్, రాజు, శేఖర్, సాగర్, మహేశ్, అరవింద్ పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాలో ఇంటర్వ్యూ స్కిల్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం విద్యార్థులకు ఇంటర్వ్యూ సమయంలో పాటించాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిభా నైపుణ్యాలు ఉన్న వారికే ఉద్యోగావకాశాలు దక్కుతాయన్నారు. ఉద్యోగ సాధనలో కీలకమైన ఇంటర్వ్యూ నైపుణ్యాలపై రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏవో పవన్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఎరుపెక్కిన కార్మిక క్షేత్రం



జ్యోతినగర్: ర్యాలీలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు శంకర్


యైటింక్లయిన్‌కాలనీ: ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో..



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బస్టాండ్ వద్ద సీపీఎం నాయకులు


ఓదెల: కొలనూర్‌లో మేడే వేడుకలు

ఎర్ర జెండాలతో కార్మిక క్షేత్రం ఎరుపెక్కింది. ప్రపంచ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి.. అనే నినాదాల నడుమ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే కార్మిక దినోత్సవం గురువారం పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. డప్పుచప్పుళ్లతో ఎర్ర జెండాలు పట్టుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. జెండావిష్కరణ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, వేడుకల్లో పాల్గొన్నారు. పలు గనులు, యూనియన్ కార్యాలయాలు, కార్మిక వాడల్లో జెండా ఎగురవేశారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, హెచ్ఎంఎస్, బీఎంఎస్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ కార్యాలయాల ఎదుట ఆయా సంఘాల నాయకులు జెండా ఎగురవేశారు. – సాక్షి నెట్‌వర్క్



రామగిరి: ఐఎన్‌టీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో..


కాల్వశ్రీరాంపూర్‌లో ర్యాలీ


రామగుండం: పెద్దంపేటలో మేడే వేడుకలు


కమాన్‌పూర్‌లో..


ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్ఎఫ్‌సీఎల్ గేటు ఎదుట..


సుల్తానాబాద్‌లో ర్యాలీ


ధర్మారం: మేడే వేడుకల్లో నాయకులు


ఎలిగేడు: సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో..


ముత్తారంలో..


గోదావరిఖని: ఐఎన్‌టీయూసీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ


పాలకుర్తి: కుక్కలగూడురులో..


జూలపల్లిలో జెండావిష్కరణ చేస్తున్న కార్మికులు

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న భూపాల్

సుల్తానాబాద్: మే డేస్ఫూర్తితో కార్మికులు సమస్యలపై పోరాటం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పూసాల రైస్‌మిల్ అసోసియేషన్ వద్ద గురువారం పలు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాలను ఆయా సంఘాల ప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని కార్మిక, ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ సమ్మెను మేడే స్ఫూర్తితో జిల్లాలోని కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, రైస్‌మిల్ గుమస్తాల సంఘం అధ్యక్షుడు మాతంగి రాజమల్లు, రైస్‌మిల్ లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు పోగుల తిరుపతి, రైస్‌మిల్ ఆపరేటర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, ఉపాధ్యక్షుడు వీరగోని కిరణ్‌గౌడ్, మహిళా కార్మిక సంఘం అధ్యక్షురాలు గున్నాల అన్నపూర్ణ, స్వరూప, మున్సిపల్ సంఘం అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, రామ్మూర్తి, రాజమౌళి, మహేశ్, ప్రసాద్, మహేందర్, స్వామి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం


మాట్లాడుతున్న గోపాల్‌యాదవ్

సుల్తానాబాద్: కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నార్ల భూపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో జిల్లాకేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ కులగణన కోసం 100రోజులకు పైగా జిల్లా రిలే నిరాహార దీక్షలు చేసినట్లు గుర్తు చేశారు. కులగణనతో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరగాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు, నియోజకవర్గ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సాతూరి అనిల్ పాల్గొన్నారు.

కార్మిక హక్కులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భవాని

మంథని: మంథని డివిజన్‌లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం నిర్వహించారు. మంథని కోర్టు ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి భవాని పాల్గొని మాట్లాడారు. కార్మికులకు హక్కులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత న్యాయ వ్యవస్థపై ఉందన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కీర్తి సింహ, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి.అనురాధ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సహేందర్‌రెడ్డి, ఏపీపీ సందీప్, ఏజీపీ బి.ఆంజనేయులు, సహాయ కార్మిక సంక్షేమ అధికారి రవీందర్, శశిభూషణ్ కాచే పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేస్తాం

మేడే స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ అన్నారు. మంథని పురవీధుల్లో గురువారం ర్యాలీ నిర్వహించారు. నాయకులు చింతల గోవింద్, ఆంజనేయులు, ఆర్ల సందీప్, మంథని లింగయ్య తదితరులు ఉన్నారు.

ఎన్టీపీసీలో కార్మికుల హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న ఏజీఎం(విజిలెన్స్) సుధాకర్ భోగరాజు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలో కార్మికుల హక్కులపై అవగాహన కల్పించారు. మేడే సందర్భంగా టెంపరరీ టౌన్‌షిప్ ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాలులో గురువారం కార్మికుల హక్కుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఏజీఎం(విజిలెన్స్) భోగరాజు సుధాకర్ పాల్గొని మాట్లాడారు. ప్రాజెక్టులో విజిలెన్స్, సమగ్రత, నైతిక పాలనను ప్రోత్సహించడానికి, విజిలెన్స్ విభాగం ద్వారా కాంట్రాక్ట్ కార్మికుల కోసం కార్మిక హక్కుల దినోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కనీస వేతనాలు, ప్రావిడెంట్ ఫండ్, ఉద్యోగుల రాష్ట్ర బీమా, ప్రసూతి ప్రయోజనాలు, సమాన వేతనం, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలు వంటి కీలకమైన కార్మిక చట్టాల గురించి సీనియర్ మేనేజర్ దీపక్‌కుమార్ పాఠక్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అధికారులు ఆదేశ్‌కుమార్ పాండే, బినోయ్ జోస్, లింగయ్య, శ్రీనివాస్, విజయ్‌కుమార్, అభిషేక్ కుమార్, సీనియర్ అధికారులు, వివిధ విభాగాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• వేసవి శిక్షణ శిబిరం వినియోగించుకోండి

జ్యోతినగర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య సూచించారు. ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీ, మేడిపల్లి రోడ్ దుర్గయ్యపల్లె పాఠశాలతో పాటు నర్రాశాలపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు.

పాలకుర్తి మండలంలో..

పాలకుర్తి: మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గురువారం వేసవి శిబిరాలను ప్రారంభించారు. జీడీనగర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాధికారి విమల పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు ఆటపాటల ద్వారా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు వీలుగా ఈ శిబిరాలు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. మండలవ్యాప్తంగా మొత్తం 22 పాఠశాలల్లో వేసవి శిబిరాలను ప్రారంభించామని, జూన్ 10 వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు.

సమ్మర్ క్యాంపు షురూ

రామగుండం: రామగుండం హైస్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని మల్యాలపల్లి, అయోధ్యనగర్, అబాది రామగుండం, పాములపేట, రామగుండం, ఎస్టీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో గురువారం నుంచి సమ్మర్ క్యాంపు ప్రారంభించినట్లు కాంప్లెక్స్ హెచ్ఎం శారద తెలిపారు.

ఎలిగేడులో..

ఎలిగేడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపును ఎంఈవో నరేంద్రచారి ప్రారంభించారు. విద్యార్థులకు గణిత సామర్థ్యాలతోపాటు ఆటలు, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ నేర్పించనున్నట్లు పేర్కొన్నారు.

గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన

రామగుండం: అంతర్గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురు గర్భిణులకు అంతర్గాం మండల వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కిరణ్ ఆరోగ్య విషయాలపై గురువారం అవగాహన కల్పించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు ప్రతీరోజు శారీరక వ్యాయామం చేయాలని సూచించారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మారం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలవీలత ఆధ్వర్యంలో విద్యార్థులను అభినందించారు. పాఠశాలకు చెందిన దివ్య 559 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ పాఠశాలలో 500 మార్కులకుపైగా సాధించిన విద్యార్థులందరినీ సన్మానించి అభినందించారు.

ఎస్సీ వర్గీకరణతో ఉన్నతంగా ఎదగాలి


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రామగిరి: ముప్పై ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని, వర్గీకరణతో ఉన్నతంగా ఎదగాలని కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్ అన్నారు. మండలంలోని నాగెపల్లి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాగెపల్లి అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు రూ.5వేల విరాళం ప్రకటించారు. అలాగే నాగెపల్లి మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్‌లు రూ.5వేలు చొప్పున ప్రకటించారు. నాయకులు శంకర్‌లాల్, శంకర్, శ్రీనివాస్, తిరుపతి, సతీశ్, ఓదెలు పాల్గొన్నారు.

కులగణనతో అందరికీ సమన్యాయం



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మంథని: ప్రధాని మోదీ తీసుకున్న కులగణన నిర్ణయం చారిత్రాత్మకమని, దేశంలోని అన్నికులాల ప్రజలకు మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మంథని డివిజన్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు రెండుసార్లు దేశంలో కులగణన పేరుతో ప్రజలను మోసం చేసిందని, రాష్ట్రంలో మొన్న జరిగిన కులగణనను సీఎం రేవంత్‌రెడ్డి తూతూ మంత్రంగా నిర్వహించి రాష్ట్రంలోని బీసీలను ముస్లింలతో కలిసి 52శాతం మాత్రమే చూపించారన్నారు. మీడియా ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన మీడియా మిత్రులను సన్మానించారు. జిల్లా అధికార ప్రతినిధి పోతరవేణి క్రాంతికుమార్, నాయకులు కృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

ఆర్జీ–3లో 89శాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి: ఆర్జీ–3లో ఏప్రిల్‌లో 89శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు గురువారం ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు తెలిపారు. ఆర్జీ–3లో నిర్దేశించిన 5.75లక్షల టన్నులకు గాను 5.09 లక్షల టన్నులు అనగా 89శాతం బొగ్గు ఉత్పత్తి, నిర్దేశించిన ఓబీ మట్టి వెలికితీత 43లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 37.76 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 88శాతం మట్టి వెలికితీయడం, 6.46 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు వెల్లడించారు. గనుల వారీగా ఓసీపీ–1 గనికి నిర్దేశించిన 3లక్షల టన్నుల లక్ష్యానికి గాను 3లక్షలు అనగా 100శాతం, ఓసీపీ–2 గనికి నిర్దేశించిన 2.75 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 2.09 లక్షల టన్నులు అనగా 76శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్లు వివరించారు. కృషిచేసిన ఉద్యోగులకు అభినందనలు తెలుపుతూ భవిష్యత్‌లో సైతం లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడానికి కృషి చేయాలని ఆదేశించారు.

ఏపీఏ గనిలో..

ఏపీఏ గనిలో ఏప్రిల్‌లో 84శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం కొలిపాక నాగేశ్వరరావు తెలిపారు. ఏప్రిల్‌లో నిర్దేశించిన 0.16 లక్షల టన్నులకు గాను 0.13 లక్షల టన్నులు అనగా 84శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు. సింగరేణి సంస్థలో బదిలీవర్కర్లుగా ఉద్యోగంలో చేరుతున్న వారు సంబంధిత అధికారులు, సూపర్‌వైజర్లు, సీనియర్ ఉద్యోగుల సలహాలు, సూచనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కోరారు.

జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి


క్యాంపును ప్రారంభిస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: సమ్మర్‌కోచింగ్ ద్వారా శిక్షణ పొంది భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదిగి సింగరేణి సంస్థకు పేరు తీసుకురావాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియంలో సమ్మర్ కోచింగ్ క్యాంపును గురువారం ఆయన ప్రారంభించారు. క్రీడలతో వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. వేసవి సెలవుల్లో ఏదైనా క్రీడలో నైపుణ్యం సాధించాలని, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో 25రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. యూనియన్ నాయకులు రవీందర్, అధికారులు అనిల్‌కుమార్, మురళీకృష్ణ, షరీఫ్‌మహ్మద్, వేణుగోపాల్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.